సాక్షి నిజామాబాద్

సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



విద్యుదుత్పత్తి లక్ష్యం చేరేనా?

శ్రీరాంసాగర్ విద్యుదుత్పత్తి కేంద్రం ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- 8లో ▸



బ్రహ్మోత్సవాలు ప్రారంభం

డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్‌లో ఆదివారం బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /22.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉం టుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎంపీడీవోలకు స్థానచలనం

- పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పెద్ద ఎత్తున బదిలీలు

నిజామాబాద్ రూరల్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎంపీడీవోలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు వెలవడ్డాయి. జిల్లా పరిషత్ సీఈవో గోవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలో పనిచేస్తున్న ఎంపీడీవోలు టీవీఎస్ గోపిబాబు, ఎం.సంతోష్ కుమార్, ఎల్.రాజేశ్వర్, బీఎస్.నీలావతి, కె.నాగవర్ధన్, సయ్యద్ అజిద్ అలీ, వి.కమలాకర్, ఎండీ బషీరుద్దీన్, టి.సంతోష్ రెడ్డి, కె.రాజేశం, టి.శ్రీనివాస్ రెడ్డి, బి.శ్రీనివాస్, టి.ప్రభన, పి.భారతీలను కామారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. అదేవిధంగా బి.రాములు నిర్మల్ జిల్లాకు, ఎం.దామోదర్ మెదక్ జిల్లాకు, జి.బాలగంగాధర్, కె.లక్ష్మణ్, కె.రజవీర్ ఆదిలాబాద్ జిల్లాకు, బి.శంకర్ సంగారెడ్డి జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. అదేవిధంగా నిజామాబాద్ జిల్లాకు పలువురు ఎంపీడీవోలు బదిలీపై వస్తున్నారు. నిర్మల్ జిల్లా నుంచి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగనాథ్, సాయిరాం, సురేష్ బాబు, విజయభాస్కర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా నుంచి ముజాఫర్‌రుద్దీన్, రవీందర్, కామారెడ్డి జిల్లా నుంచి బాలకృష్ణ, వసంత్‌రావు, సతీశ్ కుమార్, శంకర్, బాలకృష్ణ, వెంకటేశ్వర్, మెదక్ నుంచి ప్రవీణ్, ఆదిలాబాద్ నుంచి సంతోష్ కుమార్, తిరుమల, జగిత్యాల జిల్లా నుంచి రాజశ్రీనివాస్, వెంకటేశ్ జాదవ్ జిల్లాకు రానున్నారు.

అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి



సుభాష్‌నగర్: దేశంలోని చిట్టచివరి వ్యక్తికి అభివృద్ధి ఫలాలు అందాలని సంకల్పించిన గొప్ప వ్యక్తి పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పేర్కొన్నారు. ఆదివారం పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ బీజేపీ మూల సిద్ధాంతమైన ఏకాత్మ మానవతావాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించి అంత్యోదయ పథకాన్ని రూపకల్పన చేశారని గుర్తుచేశారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ మరణాంతరం జనసంఘ్ అధ్యక్షులుగా పని చేశారన్నారు. సమున్నత భారతావని కోసం కలలుగన్నారని, ఏకాత్మ మానవతావాదాన్ని ప్రవచించి, దేశం కోసం జీవితాంతం పాటుపడ్డారని, చివరకు ప్రాణాలు సైతం త్యాగం చేసిన మహనీయుడు దీన్‌దయాల్ ఉపాధ్యాయ అని కొనియాడారు. ఏకాత్మతా మానవతా వాద సిద్ధాంతం ద్వారానే బీజేపీ 2 సీట్ల నుంచి 302 సీట్ల వరకు ఎదిగిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందని, దేశంలో అత్యధిక రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ గద్దె భూమన్న, జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ, మల్లేశ్‌యాదవ్, నారాయణ యాదవ్, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఇప్పకాయల కిషోర్, భూపతి తదితరులు పాల్గొన్నారు.





కనులవిందుగా..

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతం కనువిందు చేస్తోంది. ఎత్తిపోతల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించడంతో బ్యాక్‌వాటర్ వేగంగా తగ్గిపోతుంది. దీంతో పచ్చిక బయళ్లు ఏర్పడుతున్నాయి. ఎటు చూసినా నేలపై పచ్చగడ్డి పరుచుకుంది. దీంతో పశువులకు మేత పుష్కలంగా దొరుకుతోంది. డొంకేశ్వర్ మండలం అన్నారం, గాదేపల్లి, జీజీ నడ్కుడ, చిన్నయానం ప్రాంతాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ ప్రకృతి అందాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. – డొంకేశ్వర్(ఆర్మూర్)

కిడ్నాప్‌ల వదంతులు!

- సామాజిక మాధ్యమాల్లో ప్రచారం
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు
- కొత్తవాళ్లు కనబడితే దాడులకు దిగుతున్న జనం



అనుమానాస్పద వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తున్న డిచ్‌పల్లి ఖిల్లా గ్రామస్తులు

నిజామాబాద్‌అర్బన్: పిల్లల కిడ్నాప్ ముఠాలు తిరుగుతున్నాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నారని, ఫలానా ఊళ్లో ఎత్తుకెళ్లారని, ఇంకో ఊళ్లో కిడ్నాపర్లను ప్రజలు పట్టుకున్నారని.. వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వదంతులు వ్యాపిస్తుండడంతో పట్టణాలు, గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే ప్రజలు పట్టుకుని నిలదీస్తున్నారు. కొన్నిచోట్ల దాడులకు సైతం పాల్పడుతున్నారు. ఇటీవల జిల్లాలో మూడు కిడ్నాప్ కేసులు ఈ వదంతులకు బలం చేకూర్చాయి. దీంతో విద్యార్థులను పాఠశాలలకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగం చేస్తున్న వారు పిల్లలను వదిలి వెళ్లడానికి జంకుతున్నారు.

మూడు ఘటనలతో..

జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న మూడు కిడ్నాప్ ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. నగరంలోని బైపాస్ రోడ్డులో ఇటీవల ఓ జంట బాలుడిని కిడ్నాప్ చేసి బైక్‌పై పారిపోయారు. చివరికి మోర్తాడ్‌లో ఓ కెనాల్ వద్ద వదిలి వెళ్లారు. అంతకు ముందు ఆర్మూర్ బస్టాండ్‌లో ఓ బాలుడిని వృద్ధురాలు కిడ్నాప్ చేసి బస్సులో తీసుకెళ్తుండగా అనుమానం వచ్చిన ప్రయాణికులు కమ్మర్‌పల్లి పోలీసులకు అప్పగించారు. అంతకు ముందు కూడా నగరంలో ఓ బాలుడి కిడ్నాప్ కాగా నాలుగైదు రోజుల తర్వాత నిందితుడిని పట్టుకుని బాలుడిని గుర్తించారు. ఈ ఘటనలు సోషల్ మీడియాలో వైరలవడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

కొత్తవారొస్తే..

పట్టణాలతో పాటు పల్లెల్లో కొత్త వ్యక్తులు కనబడితే చాలు కిడ్నాపర్లే అని భావిస్తున్నారు. వారిపై దాడులకు దిగుతున్నారు. రెండు రోజుల క్రితం ఇందల్వాయి మండలం గన్నారంలో ఓ మహిళపై దాడిచేసి పోలీసులకు అప్పగించారు. నగరంలో బైపాస్ రోడ్డులో చిత్తు కాగితాలు ఏరుకునే మహిళపై దాడి జరిగింది. శనివారం నగరంలోని దుబ్బ ప్రాంతంలో మతిస్థిమితం లేని వ్యక్తిపై దాడి జరిగింది. అతని జేబులో బిస్కెట్ ప్యాకెట్ లభిచండంతో పిల్లలకు బిస్కెట్ ఇచ్చి కిడ్నాప్ చేస్తున్నాడంటూ ప్రచారం చేశారు. ఇదే ప్రాంతంలో మరో వ్యక్తిపై స్థానికులు దాడికి పాల్పడ్డారు. విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టారు. నవీపేట్‌లో ఇటుక బట్టి కార్మికులను కిడ్నాపర్లుగా అనుమానించి చితకబాదారు. నగరంలోని ఆర్టీసీ కాలనీలో ఓ ప్రైవేటు స్కూల్ వద్ద ఇద్దరు బాలికలను కిడ్నాప్ చేశారని రెండు రోజుల క్రితం జోరుగా ప్రచారం జరిగింది. జక్రాన్‌పల్లిలో బాలుడి కిడ్నాప్‌కు యత్నించారని ప్రజలు జాతీయ రహదారిపై తనిఖీలు చేశారు. ఇలా వదంతులు వ్యాప్తిస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

తల్లిదండ్రులు వస్తేనే విద్యార్థుల అప్పగింత

కిడ్నాప్‌ల వదంతులు పెరగడంతో జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అప్రమత్తమయ్యాయి. వదంతుల నేపథ్యంలో తల్లిదండ్రులు వస్తేనే పాఠశాల నుంచి విద్యార్థులను పంపిస్తున్నారు. మరోవైపు పేరెంట్స్ విద్యార్థులను పాఠశాలలకు పంపాలంటేనే భయం పడుతున్నారు. అలాగే పిల్లలను ఆటోల్లో స్కూల్‌కు పంపుతున్న తల్లిదండ్రులు మానేస్తున్నారు.

అనుమానితుడిని పోలీసులకు పట్టించిన గ్రామస్తులు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఖిల్లాలో ఆదివారం మధ్యాహ్నం ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో గ్రామస్తులు అతడిని తాళ్లతో బంధించారు. అతడి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో కొందరు చేయి చేసుకోగా గ్రామపెద్దలు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న డిచ్‌పల్లి పోలీసులు ఆ వ్యక్తిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతడి కాలుకు పెద్ద గాయం ఉందని, భిక్షాటన చేసుకుంటూ జీవిస్తుంటాడని పోలీసులు తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, భౌతిక దాడులకు పాల్పడవద్దని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై మహేశ్ సూచించారు.

అనుమానితుల పట్టివేత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని శాస్త్రీనగర్‌లో ఆదివారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని చూసి చిన్నారులు కేకలు వేశారు. వెంటనే స్థానికులు ఇద్దరిని పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారణ చేపట్టగా.. బాన్సువాడకు చెందిన శివకృష్ణగా, పోతంగల్‌కు చెందిన రమేష్‌గా వారు తెలిపారు. ఇద్దరిని పోలీసులు అదుపులో తీసుకొని విచారిస్తున్నారు.



పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు అనుమానితులు

వదంతులను నమ్మొద్దు

పిల్లలను కిడ్నాప్ చేసే ముఠాలు తిరుగుతున్నాయని వదంతులు నమ్మవద్దు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులు చూసి అనుమానితులపై దాడులు చేయడం సరైంది కాదు. ఏదైనా అనుమానం ఉంటే స్థానిక పోలీసులకు, లేదా డయల్ 100కు కాల్ చేయాలి. అంతేగాని చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దు. – కల్మేశ్వర్, సీపీ

అధికారులు అవగాహన కల్పించాలి

చిన్న పిల్లల కిడ్నాప్‌ల వదంతులపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించాలి. వదంతుల వల్ల విద్యార్థుల పేరెంట్స్ భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాలల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి.

– రఘురాం, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి

పాతాళంలో జలం!

- రెండు నెలల్లో మూడు మీటర్ల లోతుకి ..
- జిల్లాలో వేగంగా అడుగంటుతున్న భూగర్భ జలాలు
- 70కిపైగా ప్రాంతాల్లో పడిపోయిన నీటి మట్టాలు



వాల్గోట్‌లో భూగర్భ జలమట్టం లెక్కలు తీస్తున్న శాస్త్రవేత్తలు

డొంకేశ్వర్/మోర్తాడ్: జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. రెండు నెలల్లోనే 70కిపైగా ప్రాంతాల్లో నీళ్లు తగ్గుముఖం పట్టాయి. డిసెంబర్‌లో 8.80 మీటర్ల లోతులో ఉన్న జలాలు జనవరి పూర్తయ్యే నాటికి 10.06 మీటర్ల లోతుకి వెళ్లాయి. అంటే సగటున 1.26 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు ఇంకిపోయాయి. డిసెంబర్, జనవరి రెండు నెలల్లో దాదాపు మూడు మీటర్ల లోతుకి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా భీమ్‌గల్, వేల్పూర్, సిరికొండ, మోపాల్, నందిపేట్, నిజామాబాద్ రూరల్ మండలాల్లో భూగర్భ జలాలు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. అత్యధికంగా సిరికొండ మండలం పాకాల గ్రామంలో ఏకంగా 9.68 మీటర్ల లోతులోకి వెళ్లాయి. ప్రస్తుతం ఫిబ్రవరి రెండో వారం కొనసాగుతోంది. యాసంగిలో వేసిన వరి, ఇతర పంటలకు వ్యవసాయ బోర్ల ద్వారా రైతులు నీరు అందిస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయి. ఎండలు కూడా ఇప్పటి నుంచే దంచికొడుతున్నాయి. మే నెల వరకు వ్యవసాయం, తాగునీటికి బోర్ల వాడకం ఎక్కువగా ఉండనుంది. తద్వారా భూగర్భ జలాలు మరింత పడిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వాడుకోకుంటే నీటి సమస్య ఏర్పడే అవకాశం ఉంటుంది. జిల్లాలో మొత్తం 81 ఫీజో మీటర్లు ఉండగా 49 ప్రాంతాల్లో పది మీటర్ల లోతులో, 17 చోట్ల 10–15 మీటర్లలో, 11 ప్రాంతాల్లో 15–20 మీటర్ల లోతులో నీటి మట్టాలు ఉన్నట్లు భూగర్భజల శాఖ గణాంకాలను విడుదల చేసింది. నాలుగు ప్రాంతాల్లో మాత్రం 20 మీటర్ల కంటే ఎక్కువ లోతులో నీరు ఉంది.

ఎక్కువ లోతులో నీరు ఉన్న గ్రామాలు

గ్రామం	మీటర్లు
గోనుగొప్పుల	26.83
తాళ్లపల్లి	20.58
కంఠేశ్వర్	20.75
ముషీర్‌నగర్	21.22

రెండు నెలల్లో భారీగా నీటి మట్టం తగ్గిన ప్రాంతాలు

గ్రామం	పడిపోయిన నీటి మట్టం(మీటర్లలో..)				
పాకాల	9.68	పచ్చల నడ్కుడ	2.60	మల్కాపూర్	2.22
ముప్కాల్	4.81	వేల్పూర్	3.70	బాద్గుణ	3.36
రామన్నపేట్	5.70	ముషీర్‌నగర్	2.96	మోపాల్	3.33
పాల్దా	3.98	సిరికొండ	3.10	మాక్లూర్	2.92
		గడ్కోల్	2.65	గోనుగొప్పుల	3.17
		చీమన్‌పల్లి	2.04		

పాఠాలు అర్థం కావడం లేదని..

- ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

కామారెడ్డి క్రైం: నీట్ కోసం సన్నద్ధమవుతున్న యువకుడు.. కోచింగ్‌లో పాఠాలు అర్థం కావడం లేదని మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. గాంధారి మండలం గండివేట్ గ్రామానికి చెందిన కృష్ణమూర్తి (19) ఇంటర్ పూర్తి చేసి వైద్య విద్యలో ప్రవేశం నిమిత్తం నీట్ కోసం హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటున్నారు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన కృష్ణమూర్తి.. ఈనెల 2 న హైదరాబాద్ వెళ్లడానికి కామారెడ్డి బస్టాండ్‌లో ఆగాడు. అక్కడినుంచి స్నేహితుడు రవికి వీడియో కాల్ చేసి తాను పురుగుల మందు తాగి చనిపోతున్నానని చెప్పాడు. రవి వెంటనే కృష్ణమూర్తి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అందరూ కలిసి బస్టాండ్‌కు చేరుకుని గాలించినా అతడి ఆచూకీ లభించలేదు. జూబ్లీ బస్టాండ్‌లోని బస్సులలో వెతకగా ఓ బస్సులో అపస్మారక స్థితిలో కృష్ణమూర్తి కనిపించాడు. వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించాడు. పాఠాలు అర్థం కావడం లేదని బాధపడేవాడని మృతుడి కుటుంబ సభ్యులు, స్నేహితులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

గ్యాస్ లీకై పేలుడు

- ఇల్లు ధ్వంసం
- ఒకరి పరిస్థితి విషమం



ధ్వంసమైన వంటగది

ధర్పల్లి: నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలోని మైలారంలో గల ఓ ఇంట్లో గ్యాస్ లీకై మంటలు అంటుకున్న ప్రమాదంలో వృద్ధ దంపతులు తీవ్రగాయాల పాలయ్యారు. పేలుడు దాటికి ఇల్లు ధ్వంసం కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నరేండ్ల రాజన్న(69) అతని భార్య నరేండ్ల గంగు(53) ఒక చిన్న గదిలో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం నిద్రలేచిన రాజన్న బీడీ వెలిగించడంతో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగాయి. దీంతో రాజన్నతో పాటు ఆయన భార్యకు మంటలు అంటుకున్నాయి. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో తీవ్ర గాయాలయ్యాయి. అయితే శనివారం రాత్రి గ్యాస్ సిలిండర్ అయిపోవడంతో కొత్త సిలిండర్‌ను మార్చారు. ఇందులో నుంచి గ్యాస్ లీకై గదిలో వ్యాప్తించింది. పేలుడు ధాటికి ఇల్లు పాక్షికంగా దెబ్బతిని, శిథిలాలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. తీవ్ర గాయాలైన వృద్ధ దంపతులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో భర్త రాజన్న పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా చేరుకొని స్థలాన్ని పరిశీలించారు. కొడుకు గంగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

మొదలైన పెళ్లిళ్ల సందడి

- 14న రెండు వేల వివాహాలు

నిజామాబాద్ సిటీ: మాఘ మాసం మొదలు కావడంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా పెళ్లిళ్ల సందడి కనిపిస్తోంది. మాఘ మాసం నుంచి వచ్చే నాలుగు నెలల పాటు వివాహాలు, ఇతర శుభకార్యాలకు అనుకూలమని వేద పండితుడు బ్రహ్మశ్రీ జోషి మధుసూదన శర్మ పేర్కొన్నారు. ఈ నెల 14న వసంత పంచమి సందర్భంగా ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో సుమారు రెండువేల వరకు వివాహాలు, గృహ ప్రవేశాలు, పలు శుభకార్యాలు జరుగనున్నట్లు జోషి తెలిపారు.

జై సియారాం అని నినదిద్దాం

- ఎంపీ ధర్మపురి అర్వింద్



ఎంపీ అర్వింద్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆలయ కమిటీ సభ్యులు

నిజామాబాద్ సిటీ: భారతీయ హిందూ బంధువులందరం ఇక నుంచి జై సియారాం అని నినదిద్దామని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆదివారం నగరంలోని ఖిల్లా రామాలయంలో రాముడికి ప్రత్యేక పూజలు నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుడు ఎంపీకి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత శనివారం పార్లమెంట్‌లో రామమందిరంపై సీనియర్ ఎంపీలు, నాయకులు మాట్లాడుకుంటూ 'రామమందిర ఉద్యమం కొన్ని దశాబ్దాలుగా జరుగుతున్నప్పుడు జై శ్రీరాం అనేది మన నినాదం ఉండేది. ఇప్పుడు అయోధ్యకు రామ్‌లల్లా వచ్చేశాడు, రాం దర్బార్ నిర్మాణం అవుతోంది. అందుకే ఇక నుంచి మన నినాదం జై సియారాం అని అందామని అనుకోవడం' జరిగిందన్నారు. ఈ నినాదంతోనే రాబోయే నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల ప్రచారం ఖిల్లా రాం మందిరం నుంచి మొదలుపెడుతున్నాం. వివిధ కార్యక్రమాలు ఆదివారం నుంచి మొదలయ్యాయని తెలిపారు. బీజేపీ ఇందూరు ప్రజల ఆశీర్వాదంతో గతంలో వచ్చిన మెజారిటీ కంటే ఎక్కువ మెజారిటీతో ఈ సీటు గెలువబోతుందని, రాముడు ఆశీర్వాదంతో మెజారిటీ పెరుగుతుందన్నారు. అలాగే పవిత్రమైన పసుపు పంట కోసం చేసిన సేవలకు కూడా ఆశీర్వాద బలంతో బీజేపీ ఇందూరు పార్లమెంట్‌లో భారీమెజారిటీ సాధించి మోదీకి బహుమతి ఇవ్వబోతున్నట్లు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్రవంతి, కార్పొరేటర్లు సుక్కా మధు, పంచరెడ్డి లావణ్య, ఆకుల హేమలత, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, అంబదాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల మౌన ముద్ర

- రోజుకో మలుపు తిరుగుతున్న అవిశ్వాస తీర్మానం
- అధికార పార్టీని ప్రసన్నం చేసుకున్న చైర్‌పర్సన్ వర్గం
- హైకోర్టు చుట్టూ తిరుగుతున్న ప్రత్యర్థి వర్గం

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై అధికారులు స్పష్టతనివ్వకుండా మౌన ముద్రలో ఉండడంతో రోజుకో నాటకీయ పరిణామం చోటు చేసుకుంటోంది. స్టే కోసం వెళ్లి హైకోర్టులో చుక్కెదురైన వినీత వర్గీయులు అధికార పార్టీని ప్రసన్నం చేసుకొని చక్రం తిప్పుతుంటే వ్యతిరేక వర్గం తమ సంఖ్యా బలాన్ని చూపుతూ హైకోర్టు చుట్టూ తిరుగుతూ ఎత్తులకు పైఎత్తులు వేసే పనిలో ఉన్నారు. మరోవైపు తనకు ఇన్‌చార్జి చైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగించాలంటూ ముస్లింలతో ధర్నా నిర్వహించిన మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను హైకోర్టును సైతం ఆశ్రయించారు. మున్సిపల్ యాక్ట్‌ను అమలు చేయాల్సిన బాధ్యత గల అధికారులు తమకేమీ పట్టనట్లుగా ఉన్నతాధికారులకే తెలుసు అంటూ చేతులెత్తేస్తూ వివాదాలకు కేంద్ర బిందువులుగా మారుతున్నారు. అవిశ్వాస తీర్మానం సమావేశంలో ఎక్స్‌అఫీషియో మెంబర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి ఓటు హక్కు ఉందా లేదా అనే స్పష్టతనివ్వకుండా సమావేశం నిర్వహించడం మొదలుకొని.. జరుగుతున్న ప్రతి అంశంలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. దీంతో మున్సిపల్ రాజకీయం గందర గోళంగా మారింది. జనవరి 4 నాటి అవిశ్వాస తీర్మానం సమావేశం నెగ్గినట్లు అధికారులు ప్రకటించడంతో ఇరు వర్గాల వారు హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు అనుకూలంగా ఉత్తర్వులు వచ్చాయంటూ చైర్ పర్సన్‌గా వినీత తిరిగి బాధ్యతలు స్వీకరించారు. దీంతో ప్రత్యర్థి వర్గం హైకోర్టుకు వెళ్లి అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఈ నెల 19వ తేదీలోగా చైర్ పర్సన్ ఎన్నిక నిర్వహించాలంటూ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. మరోవైపు వైస్ చైర్మన్ షేక్ మున్ను వేసిన కేసు ఈ నెల 19వ తేదీకి వాయిదా పడింది. ఇంత జరుగుతున్నా అవిశ్వాస తీర్మానం నెగ్గిందా.. వీగిపోయిందా అనే విషయమై ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌ను సంప్రదించగా తనకేమీ తెలియదని.. ఎన్నికల అధికారిగా నిర్వహించిన ఆర్డీవోను సంప్రదించాలంటూ తప్పించుకుంటున్నారు. ఆర్డీవో వినోద్ కుమార్‌ను సంప్రదించగా అవిశ్వాస తీర్మానం సమావేశం నివేదికను కలెక్టర్‌కు నివేదించామని.. నిర్ణయం నా పరిధిలో లేదంటూ దాటవేస్తున్నారు. ఇక కలెక్టర్ నుంచి ఎలాంటి ప్రకటన రావడం లేదు. ఈ క్రమంలో పట్టణ పరిధిలో సమస్యల పరిష్కారంపై స్పందించడానికి పాలకవర్గం పూర్తిస్థాయిలో దృష్టి పెట్టే పరిస్థితులు లేకపోవడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

విద్యారంగంపై ప్రభుత్వం నిర్లక్ష్యం



ఆర్మూర్: విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తోందని, ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపించిందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్ ఆరోపించారు. ఈమేరకు పట్టణంలో ఆదివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసి, నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంపై గత ప్రభుత్వం చేసిన తప్పులను సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కూడా చేస్తోందని ఎద్దేవా చేసారు. ఇప్పటికీ కూడా ప్రభుత్వ బడులకు సొంత భవనాలు, సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలన్నారు. నాయకులు అనిల్ కుమార్, దీపక్, కార్తీక్, సాయికృష్ణ, శ్రీకాంత్, రాజ, శివ, చిన్ను, చింటు పాల్గొన్నారు.

ఎంపీతో సెల్ఫీ కోసం పోటీ



నిజామాబాద్ సిటీ: నగరంలోని ఖిల్లా రామాలయాన్ని ఆదివారం ఎంపీ ధర్మపురి అర్వింద్ సందర్శించారు. దీంతో అక్కడి భక్తులు ఎంపీతో సెల్ఫీ ఫొటో దిగుతామని కోరగా, ఆయన వారి ఫోన్ తీసుకుని సెల్ఫీ ఫొటో తీయటంతో హర్షం వ్యక్తం చేశారు.

డ్రగ్స్ నిర్మూలనలో పోలీసుల పాత్ర కీలకం



కామారెడ్డి క్రైం: డ్రగ్స్ నిర్మూలనలో పోలీసుల పాత్ర కీలకమని ఎక్సైజ్ శాఖ కస్టమ్స్ డీఎస్పీ ఎ రంగనాథం పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం డ్రగ్స్ కేసుల పరిశోధన, నిందితుల విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని ఆయా పీఎస్‌ల అధికారులు, స్టేషన్ రైటర్లకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లో ఎఫ్ఐఆర్ నుంచి మొదలుకుని నిందితులపై చార్జిషీట్ దాఖలు చేసేంత వరకు చేపట్టాల్సిన విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మాదక ద్రవ్యాలను నిర్మూలించేందుకు చేస్తున్న కృషిలో పోలీస్ శాఖ పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, స్టేషన్ రైటర్‌లు పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తి 'లక్ష్యం' చేరేనా?

- ప్రస్తుత సంవత్సరం ఎస్సారెస్పీ లక్ష్యం 75మిలియన్ యూనిట్లు
- ఇప్పటివరకు 63 మిలియన్ యూనిట్లే ఉత్పత్తి



ఎస్సారెస్పీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో టర్బయిన్‌లు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గల జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 75 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా, జల విద్యుత సౌధ నిర్ణయించింది. కానీ ఇప్పటి వరకు 63 మిలియన్లు మాత్రమే విద్యుదుత్పత్తి జరిగింది. ప్రస్తుత యాసంగి సీజన్ ప్రారంభం నుంచి జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తి తీరు చూస్తే ప్రస్తుత సంవత్సరం లక్ష్యం చేరుకోవడం గగనంగానే ఉంది.

నాలుగు టర్బయిన్లతోనే..

కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బయిన్‌లు ఉన్నాయి. ఒక్కో టర్బయిన్ ద్వారా 9 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో మొత్తం 36 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. కానీ ప్రస్తుతం మూడు టర్బయిన్‌ల ద్వారా 1 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్రతి టర్బయిన్‌కు 2200 క్యూసెక్కులనీరు అవసరం ఉంటుంది. అంటే కాకతీయ కాలువ ద్వారా 8800 క్యూసెక్కుల నీటి విడుదల జరిగితే పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. గడిచిన 15 రోజుల వ్యవధిలో 3 మిలియన్ యూనిట్లు మాత్రమే ఉత్పత్తి జరిగింది. ఆర్థిక సంవత్సరం ముగింపు మరో 50 రోజుల సమయం మాత్రమే ఉంది. ఈక్రమంలో మరో 10 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని జెన్‌కో అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. వందల టీఎంసీల నీరు గోదావరి పాలైన సీజన్‌లో కొన్ని సందర్భాల్లో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరగలేదు. మరికొన్ని సందర్భాల్లో సామర్థ్యానికి మించి విద్యుత్ ఉత్పత్తి కూడా జరిగింది. కానీ ప్రస్తుత యాసంగీ సీజన్‌లో కాకతీయ కాలువ ద్వారా వదలాల్సిన నీటి కోటాను వరద కాలువ ద్వారా ఎల్ఎండీ ఎగువకు, ఎంఎండీకి వదలడం వల్ల విద్యుత్ ఉత్పత్తికి నష్టం వాటిల్లింది. ఈక్రమంలో జలవిద్యుత్ సౌధ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని 90 మిలియన్ యూనిట్ల నుంచి 75 మిలియన్ యూనిట్లకు తగ్గించింది. అయినా ఆ లక్ష్యాన్ని కూడ చేరుకునేలా కనిపించడం లేదు. గత సంవత్సరం విద్యుత్ ఉత్పత్తి చరిత్రలో రెండో అతి పెద్ద రికార్డుగా 139 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. విద్యుత్ ఉత్పత్తి చరిత్రలో 142 మిలియన్ యూనిట్లే రికార్డు. ఈక్రమంలో ఉన్నతాధికారులు స్పందించి కాకతీయ కాలువ ద్వారానే నీటి విడుదల చేపట్టి లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు తృతీయ స్థానం



తృతీయ స్థానం సాధించిన జిల్లా జట్టు

నిజామాబాద్‌నాగారం: హనుమకొండ జిల్లాలో ఈనెల 10 నుంచి 11వరకు రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు ప్రతిభ చూపి, తృతీయ స్థానం సాధించింది. ఆదివారం తృతీయ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టుపై 04–03 పరుగుల తేడాతో జిల్లా జట్టు గెలుపొందినట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రదాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ తెలిపారు.

ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ సాంబశివరావు, ప్రత్యేక ఆహ్వానితులు ఎస్సై రాజు, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ హాజరయ్యారు. అనంతరం వారు విజేతలకు బహుమతులు, పతాకాలు ప్రదానం చేశారు. ఆల్ రౌండ్ ప్లేయర్‌గా కళ్యాణ్‌రాజ్ (ఆర్మూర్) ప్రత్యేక బహుమతిని అందుకున్నాడు. జట్టుకు కోచ్ మేనేజర్లుగా మర్కంటి గంగా మోహన్, నరేష్, అనిల్ వ్యవహరించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవం



కోటగిరి హైస్కూల్ హెచ్‌ఎంలను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1974–2000 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కిడ్స్ (కోటగిరి ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ) ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలో విధులు నిర్వర్తించిన హెచ్‌ఎంలను కార్యక్రమానికి ఆహ్వానించి సత్కరించారు. సమ్మేళనంలో చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పూర్వ విద్యార్థులందరూ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కిడ్స్ చైర్మన్ తాటి వీరేశం, పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. 2022లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం -1 నిర్వహించగా, ప్రస్తుతం సమ్మేళనం-2ను మరింత ఘనంగా నిర్వహించాలని పలువురు పేర్కొన్నారు.

మరోసారి కాషాయ జెండా ఎగరేయాలి



ప్రజాహిత యాత్రలో పాల్గొన్న సంజయ్, ధన్‌పాల్

సుభాష్‌నగర్: కరీంనగర్ గడ్డపై మరోసారి కాషాయ జెండా ఎగరడం ఖాయమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి ధన్‌పాల్ సూర్యనారాయణ ధీమా వ్యక్తంచేశారు. కరీంనగర్‌లో ఆదివారం బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి బండి సంజయ్ తలపెట్టిన ప్రజాహిత యాత్రకు ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. సంజయ్‌తో కలిసి గ్రామగ్రామానా తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను, విజయాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతీయవాద సిద్ధాంతం కోసం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అనేకమంది అమరులయ్యారని గుర్తుచేశారు. కార్యకర్తల్లో జోష్ చూస్తే బండి సంజయ్ గెలిచిన తర్వాత జరుపుకున్న విజయోత్సవ ర్యాలీగా కన్పిస్తోందన్నారు. ఇంకోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం.. మల్లొకసారి కరీంనగర్ గడ్డపై బీజేపీ జెండా అనే నినాదంతో పని చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో మోదీ చార్‌సౌ పక్కా అంటున్నారని.. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు డక్కా ఇవ్వడం పక్కా అంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



తాడ్వాయి: మండలంలోని కృష్ణాజివాడికి సమీపంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. టాటా ఏస్ వాహనంలో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను తరలిస్తుండగా కామారెడ్డి టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. వాహనం డ్రైవర్ భువనగిరి జిల్లాకు చెందిన బాసనో నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి బియ్యంను సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి





జ్యోతి ప్రజ్వలన చేస్తున్న టీఐఈ అధ్యక్షుడు రాజీవ్ దువా.. విద్యార్థులకు జ్ఞాపికలు ప్రదానం చేసిన కలెక్టర్

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. నగరశివారులోని భూమారెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ప్రెసిడెన్సీ స్కూల్ 28వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్, టై ప్రెసిడెంట్ రాజీవ్ దువా హాజరై, మాట్లాడారు. ప్రతి విద్యార్థి పాఠశాల నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎంతో నైపుణ్యాన్ని పొందుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల కృషికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఎంతో శ్రమిస్తున్నారని అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించారు. జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులను సన్మానించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రెండురోజుల పాటు నిర్వహించిన వేడుకలు విజయవంతంగా ముగిసాయని పాఠశాల చైర్మన్ నల్ల శమంత, డైరెక్టర్ నల్ల శావ్య తెలిపారు. ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ప్రిన్సిపాల్ పవన్‌కుమార్, డీన్ మహేష్, ఇన్నోవేషన్ టీమ్ ఇన్‌చార్జి చరణ్, హెచ్ఆర్ కృపానిధి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవ్యకు కన్నీటి వీడ్కోలు

- భార్య మృతదేహాన్ని కడసారి చూసేందుకు అంబులెన్స్‌లో వచ్చిన భర్త

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నవ్య అంత్యక్రియలను భిక్కనూరులో ఆదివారం నిర్వహించారు. బైక్‌పై బయలుదేరిన దంపతులు స్వామిగౌడ్, నవ్యలను కారు ఢీకొనడంతో నవ్య అక్కడికక్కడే మృతిచెందగా స్వామిగౌడ్ తీవ్ర గాయాలై హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న విషయం విధితమే. ఆదివారం పోస్టుమార్టం అనంతరం భిక్కనూరులో నవ్య అంత్యక్రియలను నిర్వహించారు. బంధువులు, వివిధ పార్టీల నేతలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. నవ్య భర్త స్వామిగౌడ్ అంత్యక్రియల్లో పాల్గొంటానని ఒత్తిడి తెచ్చినప్పటికీ వైద్యులు వారించారు. అయినా ఆయన పెద్ద ఎత్తున రోధించడంతో బంధువులు అంబులెన్స్‌లో ఆయనను భిక్కనూరుకు తీసుకవచ్చారు. భార్య మృతదేహంను చూసి ఆయన తీవ్రంగా రోధించాడు. నవ్యకు కుమారుడు కార్తీక్‌గౌడ్ దహన సంస్కారాలను నిర్వహించాడు.

శ్రీహరిహర క్షేత్ర బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శిఖరంతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



పూజలు నిర్వహిస్తున్న పండితులు

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ గ్రామంలోగల శ్రీహరిహర క్షేత్ర ఆలయంలో ఆదివారం బ్రహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేదపండితులు పరాకుశం సీతారామాచార్యులు నేతృత్వంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మొదటిరోజు వేద పారాయణం, సుప్రభాతం, గణపతిపూజ, పుణ్యాహవాచన, హోమం, మహాపూర్ణాహుతి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఇటీవల ఈదురుగాలులకు దెబ్బతిన్న శివాలయం శిఖర ప్రతిష్ఠ నిర్వహించారు. అంతకుముందుగా శిఖరాన్ని గ్రామంలో ఊరేగించారు. పూజారులు రాహుల్‌శర్మ, రాజశేఖరశర్మ, ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి కేసులో మరో నలుగురి అరెస్ట్

కామారెడ్డి క్రైం: దళిత మహిళపై అమానుషంగా దాడి చేసిన ఘటన ఇటీవల రామారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ఇప్పటికే ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. నరేష్ అనే వ్యక్తి మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని తెలుసుకుని మొదటి భార్య, ఆమె బంధువులు వారం రోజుల క్రితం రామారెడ్డిలోని ఓ ఇంటిపై దాడి చేసి వారిద్దరిపై దాడికి పాల్పడ్డారు. దళిత మహిళను నిర్బంధించి, బెదిరించిన ఈ కేసులో ఇదివరకే అయిదుగురు నిందితులను అరెస్టు చేసి, విచారణ జరిపారు. ఈక్రమంలో మరో నలుగురు నిందితులను ఆదివారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు కామారెడ్డి డీఎస్పీ ప్రకాష్ తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు మొత్తం తొమ్మిది మందిని రిమాండ్ చేశామన్నారు. కేసు విచారణ ఇంకా కొనసాగుతుందన్నారు. ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందో తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్రైం కార్నర్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



రుద్రూర్: పోతంగల్ మండల శివారులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. మహారాష్ట్ర సరిహద్దులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తురన్న సమాచారం మేరకు కోటగిరి పోలీసులు నిఘా వేసి తెల్లవారు జామున ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించారు. తదుపరి చర్యల కోసం అధికారులకు సమాచారం అందించినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

ఇసుక లారీ సీజ్

ఆర్మూర్‌టౌన్: ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని ఆదివారం జిల్లా మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా మైనింగ్ అధికారి టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వర్ ఘటన స్థలానికి చేరుకొని లారీలోని ఇసుకకు అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేశారు. అనంతరం లారీని ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో ఉంచారు.

బైక్ అదుపుతప్పి కానిస్టేబుల్‌కు గాయాలు



కామారెడ్డి క్రైం: బైక్ అదుపుతప్పి కిందపడిపోయిన ఘటనలో 7వ బెటాలియన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. పట్టణంలోని వడ్ల గల్లీకి చెందిన కార్తీక్ 7వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం అతడు బుల్లెట్ వాహనంపై వెళ్తుండగా, దేవునిపల్లి ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. అతడికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. ఘటనా స్థలాన్ని దేవునిపల్లి పోలీసులు పరిశీలించి విచారణ జరిపారు.

ఇందల్వాయి మండలంలో ఇద్దరికి..

ఇందల్వాయి: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు, 108 సిబ్బంది తెలిపారు. మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన తలారి శ్రీనివాస్, గోప్ప బాలరాజు బైక్‌పై వెళుతుండగా అన్సాన్‌పల్లి శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొన్నారు. ఈఘటనలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. గోప్ప బాలరాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి



ఘటన స్థలంలో క్షతగాత్రులు

బాన్సువాడ రూరల్: మండలంలోని సోమేశ్వర్ శివారులో బాన్సువాడ–బోధన్ ప్రధాన రహదారిపై ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. సిద్దిపేట్ జిల్లా చిన్నకోడూరు మండలం గోనేపల్లి గ్రామానికి చెందిన వంగ భాను (25) బైక్‌పై బాన్సువాడ వైపు వస్తున్నాడు. సోమేశ్వర్ గ్రామానికి చెందిన విశాల్ బైక్‌పై బోధన్‌కు బయలుదేరగా, సోమేశ్వర్ శివారులో ఇరువురి బైక్‌లు ఎదురెదురు వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వంగ భాను తీవ్రంగా గాయపడగా, స్థానికులు నిజాబాబాద్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మృతిచెందాడు విశాల్ గాయాలు కాగా ప్రాథమిక చికిత్స అనంతరం నిజామాబాద్ తరలించారు. తమకు సమాచారం అందగానే క్షతగాత్రులను 100 వాహనంలో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించామని సీఐ కృష్ణ తెలిపారు. ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. న్నారు.

ఇందల్వాయి మండలంలో..

ఇందల్వాయి: మండలంలోని ఇందల్వాయి- ధర్పల్లి రోడ్డుపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన గంగదాసు(42) ఆదివారం ధర్పల్లి మండలం సీతాయిపేట గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అన్సాన్‌పల్లి వద్ద అతడి బైక్‌ను ఇందల్వాయి వైపు వస్తున్న బైక్ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగాదాసు ఘటనాస్థలంలోనే మృతి చెందగా, మరో బైక్‌పై ఉన్న ఆర్మూర్‌ప్రాంత వాసులకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నాడు.

గాంధారి మండలంలో..



కడెం విక్రంగౌడ్(ఫైల్)

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా.. గాంధారికి చెందిన కుమ్మరి లింగమేశ్వర్ శనివారం రాత్రి తన పుట్టినరోజును స్నేహితులు కడెం విక్రం గౌడ్(19), సునుగరం సందీప్‌తో కలిసి గ్రామ శివారులో జరుపుకున్నారు. అనంతరం వారు ఒకే బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగ స్థానిక జీపీ కార్యాలయం వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్ వెనక కూర్చున్న విక్రంగౌడ్ కింద పడిపోగ, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యలో కూర్చున లింగమేశ్వర్‌కు స్వల్ప గాయాలు కాగా, సందీప్ క్షేమంగా ఉన్నాడు. మృతుడి తండ్రి నారాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో రైతు..



బాబురావు (ఫైల్)

సిరికొండ: ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన కంచెట్టి బాబురావు(43) ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. పొలంలో మోటారు బంద్ ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వచ్చి, మరమ్మతులు చేయసాగాడు. ట్రాన్స్‌పార్మర్‌ను బంద్ చేశాననుకొని, గద్దె పైకి ఎక్కగా ఒక ఫ్యూజ్ కనెక్షన్ నేరుగా ఉండటంతో అతడు విద్యుత్ షాక్‌కు గురై, కింద పడిపోయాడు. స్థానికులు అతడిని గమనించి అంబులెన్స్‌లో జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి తల్లి మల్లవ్వ, భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్‌లో ముగ్గురిపై కేసు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలకేంద్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. వారి వాహనాలను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపవద్దని వాహనదారులకు సూచించారు.

యువతి అదృశ్యం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన మన్నె అనిత (24) యువతి అదృశ్యమైనట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఈ నెల 10న అనిత కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేసి ఇంట్లో పడుకుంది. మరుసటిరోజు ఉదయం ఇంట్లో ఆమె కనబడకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బొల్లారం గ్రామానికి చెందిన కొరబోయిన హరీష్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె సోదరుడు ప్రవీష్‌కుమార్ నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మిస్సింగ్‌కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.